

ఆశా కార్యకర్తల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పాడేరు: ఆశా కార్యకర్తల, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. పాడేరులో రెండవ మహా సభ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు. ఎస్‌బి పోతురాజు, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు వి.విజయ సమక్షంలో ఈ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలుగా దాసమ్మ(పాడేరు) అధ్యక్షులుగా రేణుక(పాడేరు), కార్యదర్శిగా కె.పద్మ(గూడెం), ట్రెజరర్‌గా సరస్వతి(ముంచంగిపుట్టు), ఉపాధ్యక్షలుగా వివి. కొండమ్మ(అరకు) జాయింట్ కార్యదర్శిగా ఎం మేరీ (డుంబ్రిగుడ), కమిటీ సభ్యులుగా అన్ని మండలాల నుంచి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెరుగుతున్న ధరల కనుగుణంగా జీతాలు పెంచాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్పు చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సుందరరావు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్- ఘనంగా గురుపూజోత్సవం



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు: విద్యార్థుల్లో నైపుణ్యాలను గుర్తించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే శక్తి సామర్థ్యాలు గురువుల సొంతమని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఉద్ఘాటించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక కాఫీ హౌస్ లో గురుపూజోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థినులు వందేమాతరం, భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్, మాజీ శాసన సభ్యులు గిడ్డి ఈశ్వరి, జిల్లా రెవెన్యూ అధికారి పి. పద్మలత, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీతో కలసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుడు సమాజ అభివృద్ధికి మూల పురుషుడని, సమాజ బాగుకు ఒక ఆయుధమని తెలిపారు. ఉపాధ్యాయుడు అందరికీ ఆదర్శంగా ఉన్నందున వారికి ఎప్పటికీ గౌరవం ఉంటుందన్నారు. విద్యార్థుల అభిరుచి, వారి ఆలోచనలకు అనుగుణంగా ఉపాధ్యాయులు అప్ గ్రేడ్ కావాలని, భోధన ప్రత్యేకంగా ఉండాలని సూచించారు. టీచింగ్ మెథడాలజిలో మార్పు రావాలని, విశ్లేషనాత్మకంగా భోధన ఉండాలని, పిల్లలలో కాన్ఫిడెన్స్ మెరుగు పరచి భయం పోగొట్టాలని సూచించారు. అంగన్వాడీ వర్కర్ కూడా ఉపాధ్యాయురాలేనని కలెక్టర్ అన్నారు. పిల్లలలో లోపాలను, వెనుకబాటుతనాన్ని గుర్తించి వారు విద్యలో ఎదిగేలా నైపుణ్యతతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులుకు కలెక్టర్ సూచించారు. రానున్న 10వ తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ లేకుండా 80 శాతం ఉత్తీర్ణతతో ఉత్తమ ఫలితాలు సాధించడానికి అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మాజీ శాసన సభ్యులు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. మెడిటేషన్ తో ఒత్తిడికి దూరమై ఆరోగ్యవంతంగా ఉండగలమన్నారు. విద్యార్థులు డ్రగ్స్ కి దూరంగా ఉండాలని హితవు పలికారు. జిల్లా రెవెన్యూ అధికారి పి.పద్మలత మాట్లాడుతూ, గురుపూజోత్సవాన్ని జరుపుకోవడం సంతోషకరమన్నారు. అటువంటి మహోన్నత వ్యక్తి మార్గంలో ముందుకు సాగాలని, క్రమశిక్షణ, నైతిక విలువలుతో కూడిన విద్యనందించి నైపుణ్యాన్ని వెలికి తీయాలన్నారు.ట్రైకర్ డైరెక్టర్ కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేసి మంచి విద్యను అందిస్తున్నారన్నారు. గురు పూజోత్సవం సందర్భంగా జిల్లాలో ఎంపిక చేసిన 63 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందించి ఘనంగా సత్కరించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు పలు నృత్యాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాది కార్యాలయ సహాయ సంచాలకులు బాలకృష్ణ, మాజీ ఎంపిపి బుర్ర విజయ రాణి, ఉప విద్యాశాఖాదికారులు, మండల విద్యా శాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి-చింతపల్లి : అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధికి సహకరించాలని టిడిపి అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అయ్యన్న జన్మదిన వేడుకల్లో పాల్గొని ఆయన స్థానిక సమస్యలను అయ్యన్న దృష్టికి తీసుకొచ్చారు. లంబసింగి పర్యాటక అభివృద్ధి, రహదారులు, తాగునీరు, విద్యుత్ సదుపాయాల మెరుగుదల, గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు, రైతులకు సాగునీరు, మార్కెట్ సదుపాయాల కోసం ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించి అయ్యన్న ఏజెన్సీ అభివృద్ధికి తన పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.



అయ్యన్నను సత్కరిస్తున్న నేతలు

8న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి మండలం బెన్నవరం పంచాయతీ కేంద్రంలో ఈనెల 8వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం గాయత్రి వైద్య కళాశాల నిపుణులు హృద్రోగాలు, కిడ్నీ, చర్మం, కంటి, స్త్రీ, పిల్లల వ్యాధులు, షుగర్, రక్తపోటు వంటి రుగ్మతలకు చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారిని అవసరమైతే విశాఖకు తరలిస్తామని, శిబిరానికి వచ్చేవారు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు తీసుకురావాలని నిర్వాహకులు సూచించారు.

కాఫీ బెర్రీ బోరర్‌ను నిర్మూలించవచ్చు

-డ్వామా ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్



పరిశీలిస్తున్న విద్యా సాగర్

ప్రజాశక్తి-అరకులోయ:కాఫీ రైతుల సహకారంతో కాఫీ బెర్రీ బోరర్‌ను నిర్మూలించవచ్చని డ్వామా ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ విద్యాసాగర్ అన్నారు. డ్వామా ప్రాజెక్టు అధికారి శుక్రవారం అరకువ్యాలీ మండలం పకనకుడి గ్రామంలో కాఫీ బెర్రీ బోరర్ సోకి నష్టపోయిన కాఫీ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ, చినలబుడు గ్రామ పంచాయతీ పకనకుడి- 29 ఎకరాలు, మలివలస - 29 ఎకరాలు, మలసింగారం 07 ఎకరాలు, చినలబుడు 05 ఎకరాలు, తురాయికీయిడ - 02 ఎకరాలకు బెర్రీ బొర్రర్ సోకినట్లు గుర్తించడం జరిగిందన్నారు. కాఫీ బెర్రీ బోరర్ గుర్తించిన వెంటనే అరికట్టే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కాఫీ బెర్రీ బోరర్ సోకిన ప్రాంతం నుండి ఎంత వరకు ఇన్ఫెక్షన్ ఏరియా గుర్తించి జోన్ ల వారిగా రెడ్, ఎల్లో, బ్లూ ఫ్లాగ్స్ ఏర్పాటు చేసి జోన్‌ల వారిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కాఫీ ఫీల్డ్ ఫంక్షనరీ సూచనల మేరకు కాఫీ బోర్డు కెజి కాఫీకి రూ.50 రూపాయలు నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందని, పూడ్చిపెట్టే ఖర్చు, ఇతర ప్రయోజనాల కోసం ఎకరానికి రూ.5 వేలు చెల్లించడం జరుగుతుందన్నారు. కాఫీ తోటకి పట్టిన పురుగుని నాశనం చేయాలన్నారు. లేకపోతే కాఫీ ఉత్పత్తి తగ్గుతుందన్నారు. కాఫీ పంటలో వచ్చిన పంటను తీసి వేడినీటిలో ఉడకబెట్టి దానిని మట్టిలో పూడ్చాలన్నారు. లేకపోతే ఆ పురుగు విస్తరించి మరింత నష్టాన్ని కలిగిస్తుందన్నారు. నష్టపోయిన రైతులు ఎవరూ కలత చెందవద్దని నష్టపరివారం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాఫీ బోర్డు సహాయసంచాలకులు లకే బొంజుబాబు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్ నందా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

గిరిజన రైతులకు రాజ్‌మా విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని చిన్నగడ్డ సచివాలయంలో శుక్రవారం గిరిజన రైతులకు రాజ్‌మా విత్తనాలను చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్‌మా గింజలకు మార్కెట్‌లో విశేషమైన డిమాండ్ ఉన్నందున గిరిజన రైతులు దీన్ని విస్తృతంగా సాగు చేసి లాభాలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కిముడు కృష్ణమూర్తి, లక్కోజు నాగభూషణం, ఆనంద్, చిన ఖాసీం వల్లి, చిన్నగడ్డ పీసా ఉపాధ్యక్ష, కార్యదర్శులు కొర్ర మోహన్‌రావు, వంతల బాలకృష్ణ, వైసిపి నాయకులు వేములపూడి పరమేశ్వరరావు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న సర్పంచ్

ఎమ్మెల్యే కృషితోనే అంజలి శనివారం రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-చింతపల్లి : పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు కృషి, పట్టుదలతోనే మండలంలోని అంజలి శనివారం రహదారి నిర్మాణం జరిగిందని చింతపల్లి వైస్ ఎంపీపీ సాగిన వెంగళరావు అన్నారు. శనివారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పదవిలో ఉన్న ఐదేళ్లలో ఈ రహదారి పూర్తి కాలేదని, ఆ సమయంలో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడినా పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రస్తుత ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు కలెక్టర్, ఇంజనీరింగ్ అధికారులు, ప్రాజెక్టు అధికారులను తరచూ సంప్రదించి, సమస్య పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. గురువారం మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అంజలి శనివారం పంచాయతీ పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు రహదారి నిర్మాణానికి సహాయ సహకారం అందించలేదని చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఇలాంటి ఆరోపణలు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నమే తప్ప వాస్తవం కాదని వెంగళరావు మండిపడ్డారు.

ఘనంగా ఎల్ఐసి వార్షికోత్సవం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక ఎల్ఐసి కార్యాలయంలో ఎల్ఐసీ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఉద్యోగులు, ఏజెంట్లు, అధికారులు పాల్గొని వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం ఐసీఈయూ బేస్ యూనిట్ ప్రెసిడెంట్ కే కేశబద్రం పడాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్.కోట డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ కేశవరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎల్ఐసీ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా నిలుస్తూ కోట్లాది ప్రజలకు భద్రతా కవచంలా నిలుస్తోందన్నారు. ఉద్యోగులు, ఏజెంట్ల కష్టంతో పాటు వినియోగదారుల నమ్మకం కారణంగానే ఈ స్థాయికి ఎదిగిందన్నారు. భవిష్యత్తులో మరింత ప్రజల మన్ననలు పొందే విధంగా సేవలను విస్తరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సిహెచ్ శ్రీనివాసరావు, అసోసియేషన్ లీడర్ ఎర్రన్న, శ్రీరామ్మూర్తి, చెన్నయ్య ఎల్ఐసి సిబ్బంది, ఏజెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

వరద తగ్గినా ..వీడని భయం..

- శాంతించిన గోదావరి, శబరి
- నిత్యావసరాలకు అవస్థలు
- ముంపు బాధితులందరికీ ఇళ్లు నిర్మించేలా చూస్తా : ఎమ్మెల్యే శిరీషాదేవి




నాటు పడవపైనే వెలుతున్న ముంపు బాధితులు



వడ్డిగూడెం వెలుతున్న ముంపు బాధితులు

ప్రజాశక్తి - విఆర్ పురం: భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం శుక్రవారం సాయంత్రం 40.80 అడుగులు నమోదైంది. మరో వారం పాటు గోదావరి 40 అడుగుల ఎత్తులోనే ప్రవహించే అవకాశం ఉందని సిడబ్ల్యూసి అధికారులు చెబుతున్నారు. విఆర్‌పురం మండలంలోని శబరి గోదావరి సంగమం గ్రామంలో వరద ఇంకా గృహాల్లో నుంచి తగ్గకపోవడంతో ముంపు బాధితులు ఆందోళన చెందుతున్నారు మండలంలోని రహదారులు లేక వ్యవసాయ కూలీ పనులు, ఉపాధి పనులు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క అధిక వర్షాల కారణంగా చాలా తీవ్రమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నామని నిత్యావసర సరుకులతో పాటు ప్రతి కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సహాయం కింద ఇవ్వాలని ఇకనైనా ప్రభుత్వం ముంపు మండలాలపై ప్రత్యేకదృష్టి పెట్టాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలకు రహదారులు బంద్ అయ్యాయి. మండలంలోని శ్రీరామగిరి, సీతంపేట, సక్కనపల్లి, కల్తునూరు, పోచవరం ఇప్పుడు కన్నాయిగూడెం, చింతరేగుపల్లి, రామవరం రామవరం పాడు వడ్డుగూడెం కాలనీ, సీతంపేట, మొద్దులగూడెం గ్రామాల మధ్య ఉన్న రహదారులపై వరద నీరు రావడంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. భద్రాచలంలో గోదావరి ఒక అడుగు తగ్గిన దిగువ ప్రాంతాలలో వరద క్రమేపి పెరగడంతో ముంపు వాసుల్లో భయాందోళన మొదలైంది.



ముంపు గ్రామాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం అందిస్తాం : ఎమ్మెల్యే శిరీషాదేవి

ఇటీవల సంభవించిన శబరి గోదావరి వరదలకు విఆర్ పురం మండలంలోని పలు గ్రామాలు ముంపునకు గురైన విషయం విదితమే. ఎమ్మెల్యే శిరీషదేవి వడ్డెగూడెం, రామవరం గ్రామాల్లో శుక్రవారం సందర్శించారు. ముంపు గ్రామాల ప్రజలతో మాట్లాడి వాళ్ల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీలో రంపచోడవరం నుండి పోలవరం గురించి ప్రస్తావించానన్నారు. వరదలు వచ్చి నెల రోజులు గడుస్తున్నా వరద బియ్యం ఇవ్వలేదని తెలపగా వెంటనే స్పందించి కలెక్టర్‌తో మాట్లాడానని రేషన్ కార్డు ఉన్నవారికి, లేనివారికి కూడా రెండు మూడు రోజుల్లో 25 కిలోల బియ్యం నిత్యావసర సరుకులు పంపిణీ చేసే బాధ్యత తీసుకుంటా మన్నారు. పోలవరం ముంపునకు గురవుతున్న ప్రతి కుటుంబానికి ఇంటి స్థలాలు ఇప్పించి ఇళ్లు కట్టించే వరకు బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. జెడ్పిటిసి వల్ల రంగారెడ్డి టిడిపి మండల నాయకులు పాల్గొన్నారు.

ముంపునకు గురైన పంట భూములకు నష్టపరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-కూనవరం: మండలంలోని అన్ని పంచాయతీల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా యూరియా, మిగతా కాంప్లెక్స్ ఎరువులు రైతులకు ఇవ్వాలని జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య అన్నారు. మండలంలోని కూటూరు గ్రామంలో బాబు బొర్రయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులు ఖరీఫ్ పంట వేసే సమయంలో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ వరకూ వరదలు ఉండటం వల్ల పంటలు పండించే పరిస్థితి లేదన్నారు. పైగా ఈ భూములు పోలవరం ప్రాజెక్టు ముంపులో ఉన్నాయని ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వని భూములు ఎక్కువ ఉన్నాయని దీంతో రైతులు రెండు విధాలుగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ముంపు బాధితులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కూనవరం మండలంలో రైతుసేవాకేంద్రాల్లో ఎక్కడా యూరియా లేదని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వరావు జిల్లా కమిటీ సభ్యులు నాగమణి పాల్గొన్నారు.



గిడ్డి ఈశ్వరికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మా గ్రామానికి రోడ్డు వేయరూ..

- గిడ్డి ఈశ్వరికి అరగడపల్లి గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి- జికె వీధి: మండలంలో సుమారు 16 పంచాయతీలకు రహదారులు లేక ఇబ్బంది పడుతున్నామని డోలీమోతలే ఇంకా కొనసాగుతున్నాయని ఇప్పటికైనా రహదారి సమస్య తీర్చాలని శుక్రవారం అరగడపల్లి గ్రామస్తులు పాడేరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరిని కలిసి వినతిపత్రం అందించారు.కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు, వంచుల పంచాయతీ జనసేన అధ్యక్షులు కూడా మధుకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

రైతులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి- జికె వీధి : మండలంలో ప్రతిరైతుకి విత్తనాలు యూరియా అందేలా చూడాలని వైసిపి నాయకులు కోరారు. ప్రస్తుతం మండలం మొత్తానికి సుమారు 250 యూరియా బస్తాలు దిగుమతి చేశారని ఒక్క జికె వీధి పంచాయతీలోనే మొత్తం 56 గ్రామాలు ఉన్నాయని 90 యూరియా బస్తాలు ఎన్ని పంచాయతీలకు సరిపోతాయని ఈ లెక్కన చూస్తే ఊరికి ఒక్క బస్తా కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. అన్నదాత సుఖీభవ పేరున మొదటి విడత కింద 7వేలు ఇవ్వాల్సి ఉండగా చాలామంది రైతులకు 2వేలు మాత్రమే నగదు వచ్చిందని మిగతా నగదు ఎవరి ఖాతాలో పడిందని ప్రశ్నించారు. ఇప్పటికైనా రైతులందరికీ చిక్కుళ్ళు విత్తనాలు అందించకపోతే రైతుల పక్షాన ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు వంతల అరుణ్‌కుమార్,మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, నియోజకవర్గ యువజన అధ్యక్షులు లమ్మసింగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నిర్వాసితులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న ఎస్‌డిఎం సత్యనారాయణ

నిర్వాసితులకు నిత్యావసరాల పంపిణీ


ప్రజాశక్తి - దేవీపట్నం: 69వ జీవిత బీమా వారోత్సవాల్లో భాగంగా పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసిత గ్రామాలైన దేవీపట్నం మండలం గానుగొలగొంది మూలపాడు గ్రామాల్లో నిర్వాసితులకు రాజమండ్రి ఎల్ఐసి డివిజన్ ఎస్‌డిఎం సత్యనారాయణ సాహు, సర్పంచ్ కుంజం రాజమణి నిత్యావసర వస్తువుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌డిఎం సత్యనారాయణ సాహు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎల్ఐసి ద్వారా జీవితానికి బీమా రక్షణ కల్పించుకుని ఆర్థిక ప్రయోజనాలు పొందాలని అన్నారు. ఈ సందర్భంగా సుమారు 100 నిర్వాసిత కుటుంబాలకు నిత్యావసర వస్తువుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, సేల్స్ మేనేజర్‌శర్మ, గోకవరం బిఎం సూర్యనారాయణ, ఎబిఎం కోటేశ్వరరావు, మేనేజర్లు రేఖ, రంగనాయకులు, శ్రీకిరణ్, సుధాకర్, కిషోర్, గన్నెయ్య, విశ్వనాథ్, మాథ్యూస్, ఏజెంట్ యూనియన్ నాయకులు నాగరాజు, ఏజెంట్స్ విష్ణుమూర్తి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై పోరాటానికి సిద్ధంకండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: గ్రామాల్లో నెలకొన్న స్థానిక సమస్యలపై సిపిఎం నాయకులు పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం మండల కార్యదర్శి కొండ్ల సూరిబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం సభ్యులు జర్తారాజు అధ్యక్షతన పార్టీ మండల కమిటీ, శాఖ కార్యదర్శులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ఏజెన్సీలో గ్రామాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని, ప్రధానంగా రహదారులు, తాగునీరు, విద్యుత్, వైద్యం వంటి సమస్యలు ఉన్నాయని వాటితో పాటు పించన్లు, పెరిగిన విద్యుత్ ఛార్జీలు, పెరిగిన నిత్యావసర సరుకులు వంటి సమస్యలపై గ్రామస్తులను సమీకరించి ఆందోళన చేపట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, పార్టీ మండల నాయకులు పాండవులు సత్యనారాయణ, టి.శ్రీను, కె జగన్నాథం, రామరాజు, ఎం.మురళి, పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరిసాకు నివాళి

ప్రజాశక్తి - అడ్డతీగల : స్థానిక మండల కేంద్రంలో మదర్ థెరిసా విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళు లర్పించారు.సంఘం కమిటి మెంబర్ చోడిశెట్టి సుబ్బా రావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్తిబాబు, టిడిపి నాయకులు బీర బాలయోగి, యువజన నాయకుడు మడకంపైడయ్య దొర, చెల్లం దాస్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్, టిడిపి నాయకులు

ఘనంగా అన్నదానం

ప్రజాశక్తి- విఆర్‌పురం: మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో వరసిద్ధి వినాయకస్వామి మండపంలో నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పేరు గాంచిన చీరలు, వస్త్రాల ప్రదర్శన,అమ్మకాలను గ్రీన్‌పార్కు హోటల్ లో 5 రోజులు పాటు నిర్వహించే నేషనల్ సిల్క్‌ఎక్స్‌పోను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భం గా నిర్వాహకులు మీడియాతో మాట్లాడుతూ ఈ రోజు నుంచి 8వ తేదీ వరకు ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలాది రకాల పట్టు, కాటన్ డిజైన్ వస్త్రాలు, డిజైనర్ చీరలు, మొదలైన వాటిని దేశంలోని వివిధ రాష్ట్రాల నేత కార్మికులు 50 శాతం వరకు తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

ఉన్నత విద్యాబోధనతో వికసిత్ భారత్

ఎయు సైన్స్ కాన్‌క్లేవ్‌లో పద్మశ్రీ ఆచార్య సంఘమిత్ర బందోపాధ్యాయ



పద్మశ్రీ ఆచార్య సంఘమిత్ర బందోపాధ్యాయను సత్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: స్వర్ణాంధ్ర - వికాసిత భారత్ 2047 చేరుకోవడానికి ఉన్నతస్థాయి విద్యాబోధన జరగాలని, దీనికి నూతన విద్యావిధానం ఎంతగానో దోహదపడుతుందనిపద్మశ్రీ అవార్డు గ్రహీత, కోల్‌కతా ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ సంచాలకులు ఆచార్య సంఘమిత్ర బందోపాధ్యాయ అన్నారు. విద్యార్థులకు మంచి మార్గనిర్దేశకంగా విద్యావ్యవస్థలు నిలవాలని ఆకాంక్షించారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా బీచ్ రోడ్‌లోని ఎయు కన్వెన్షన్ సెంటర్ వేదికగా 'సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్రాంటియర్స్ ఫర్ స్వర్ణాంధ్ర అండ్ వికసిత్ భారత్-2047' అనే అంశంపై కాన్‌క్లేవ్ నిర్వహించారు. భారతరత్న, భారత పూర్వ రాష్ట్రపతి, ఎయు పూర్వ ఉపకులపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్‌కు ఘన నివాళు లర్పించారు. అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్ (ఎఎస్‌టిసి,హైదరాబాద్) సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన కాన్‌క్లేవ్‌లో ఆచార్య సంఘమిత్ర బందోపాధ్యాయ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకష్ణన్ ఉపకులపతిగా పనిచేసిన ఆంధ్రవిశ్వవిద్యాలయంలో టీచర్స్ డే వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. దేశానికి సర్వేపల్లి రాధాకష్ణన్ అందించిన సేవలను కొనియాడారు. ప్రస్తుత కాలంలో టెక్నాలజీ మనిషిని శాసిస్తుందని, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మనిషికి గట్టి సవాలును విసురుతోందన్నారు. విద్యార్థులు పూర్తిస్థాయిలో టెక్నాలజీ మీద ఆధారపడకుండా పరస్పరం బృంద చర్చల ద్వారా తమ ఆలోచనలను బదలాయించుకుని నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. అన్ని రాష్ట్రాల పురోభివృద్ధితోనే వికసిత్ భారత్ సాకారమౌతుందన్నారు.

ఐఎండి డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర ప్రత్యేకఅతిథిగా పాల్గొని పద్మవిభూషణ్ డాక్టర్ పి.కోటేశ్వరం స్మారక ఉపన్యాసాన్ని అందించారు. ఫిజికల్, డిజిటల్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ, టెక్నాలజీల సహకారంతో వాతావరణ మార్పులను గమనించాలన్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (హైదరాబాద్) డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్ సమాజ అభివృద్ధికి భారత అతరిక్ష పరిశోధనలు అంశంపై ప్రత్యేక ప్రసంగం అందించారు. ఏయు విసి ఆచార్య జి.పి రాజశేఖర్ ఎయు అభ్యున్నతికి, దేశాభివృద్ధికి సర్వేపల్లి సేవలను కొనియాడారు. సదస్సులో భాగంగా నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, ఎన్ఆర్ఎస్‌సి, హైదరాబాద్‌తో ఎయు అవగాహన ఒప్పందాలను కుదర్చుకుంది. ఈ మేరకు పరిశోధనలకు కావలసిన టెక్నాలజీ, పరికరాలుకు ఎన్ఆర్ఎస్‌సి రూ.1.58 కోట్లను ఎయుకు అందించనుంది. రెక్టార్ ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్‌కె. రాంబాబు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్ వర్తింపజేయాలి

ప్రజాశక్తి గాజువాక.: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎపిఎఫ్ 95 పెన్షనర్లందరికీ హయ్యర్ పెన్షన్ వర్తించాలని ఎఐటియుసి నాయకులు డి ఆదినారాయణ అన్నారు. శుక్రవారం పెదగంట్యాడ సిడబ్ల్యూసిలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతూ ఇపిఎఫ్ 95 పెన్షనర్లందరికీ డిమాండ్ లెటర్స్ పంపించాలని కోరారు. సిఐటియు నాయకులు వైటి దాసు మాట్లాడుతూ హయ్యర్ పెన్షన్ వర్తించే వరకు ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జె.అప్పలస్వామి కిల్లా దీనబంధు, కె.హుస్సేన్, కె.పెంటారావు నమ్మి అప్పలనాయుడు, మరిశెట్టి వెంకట్రావు, ఎన్‌వి.రమణ ఎస్ అప్పారావు సన్యాసిరావు, కణితి అప్పలరాజు రాజు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు






జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు స్వీకరిస్తున్న హుకుంపేట, అనంతగిరి మండలాల ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-హుకుంపేట : పాడేరు కాఫీ హౌస్‌లో హుకుంపేట ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల (బాలురు-01) ఉత్తమ ప్రధానోపాధ్యాయులు వంతిని బాలాజీకి కలెక్టర్ దినేష్ కుమార్ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అట్టడుగున ఉన్న ఉపాధ్యాయులను గుర్తించి, వారి సేవలను ప్రశంసిస్తూ అవార్డు అందజేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

అనంతగిరి: మండలంలోని చిలకలగెడ్డ బాలుర ఆశ్రమోన్నత పాఠశాల సోషల్ టీచర్ శెట్టి. రాంబాబుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విజయవాడ కేంద్రంలో ప్రశంసా పత్రాన్ని అందించారు. చిలకలగెడ్డ ఎంపీపీఎస్ పాఠశాల టీచర్ నారాజీ మల్లేశ్వరరావు అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందుకున్నారు.

అరకులోయ: సమాజ అభివృద్ధికి ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, అరకు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి సియ్యారి దొన్ను దొర అన్నారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక కంఠ బంస్‌గూడ సిఏహెచ్ స్కూల్లో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దే పాత్ర ఉపాధ్యాయులదేనన్నారు. దేశం శాస్త్ర సాంకేతిక రంగంలో అభివృద్ధి చెందడానికి కారణం అందిస్తున్న గుణాత్మక విద్య అని ఆయన అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందించవలసిన బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉందని ఆయన అన్నారు. ఉన్నత చదువులు చదువుకుంటేనే సమాజాభివృద్ధి సాధ్య పడుతుందన్నారు.

అనంతరం సీనియర్ ఉపాధ్యాయులను. అరకులోయ ఎంఈఓ త్రినాథ్‌రావు, సిఏహెచ్ స్కూల్ హెచ్ఎం దయానిధి, ఏటిడబ్ల్యూవో వెంకటరమణలను, సీనియర్ ఉపాధ్యాయులు కన్నబాబు, రంగారావు, సన్యాసిరావు, రామారావు పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేది దాసు బాబు, ఉపాధ్యాయ బృందం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ప్రతినిధి టి.చిట్టిబాబు, ఉపాధ్యాయ సంఘం ప్రతినిదులు, సింహాచలం, నారాయణ, ఈశ్వరరావు, గోపాల్, మహాదేవ్, చందు,రాజేష్,కుమార్, జగన్,ఆనంద్ పాల్గొన్నారు.



అరకులోయలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దొన్నుదొర

సీనియర్ ఉపాధ్యాయునికి సత్కారం



సాగిన వీరన్న పడాల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చింతపల్లి : చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎన్.కృష్ణయ్య కళాశాల చరిత్ర ఆధారంగా రచించిన గీతాన్ని సీడీ రూపంలో ఆవిష్కరించారు. కళాశాల గీతానికి లిరిక్స్‌ను ఎన్.కృష్ణయ్య, గానాన్ని నాగరాజు కడారి, సంగీతాన్ని వివి.నాయక్ అందించగా, సమన్వయకర్తగా కెవి.మురళీకృష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతపల్లి మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన గురుపూజోత్సవం సందర్భంగా విద్యాశాఖలో సుదీర్ఘకాలం శ్రమించి, అనేక తరాలను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దిన సీనియర్ ఉపాధ్యాయుడు సాగిన వీరన్న పడాల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు ఉగ్రంగి వెంకటగిరి, నాయకులు కొర్రు మత్స్యలింగం, రోబ్బ వెంకట రమణమ్మ, కుడుముల వెంకటరమణ, సత్తిబాబు, కదుల్లా గిరిజారాణి, తగ్గి త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల అమలుపై పరిశీలన

ప్రజాశక్తి- సీతమ్మధార : మధురవాడ పిహెచ్‌సి, వాంబేకాలనీలోని యుపిహెచ్‌సిలను శుక్రవారం డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు.

అక్కడ జరుగుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు,ఒపి, ఐపి, ఇహెచ్ఆర్ డయాగ్నొస్టిక్ సేవలు, మందులు, ఆర్‌బిఎస్‌కె, ఆర్‌కెఎస్‌కె సేవలపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కాంప్రహెన్సివ్ స్క్రీనింగ్ రిఫరల్ సేవలు గురించి విశదీకరించారు. అభ ఐడి మ్యాపింగ్ శతశాతం సాధించాలని ఆదేశించారు ఫ్రైడే-డ్రైడే అమలు తీరును పరిశీలించారు. దోమలు, లార్వా వృద్ధి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బస్సులు నిలుపుదల చేయకపోవడంపై

జనాగ్రహం

నరసాపురంలో రోడ్డెక్కి ధర్నా : బస్సులను అడ్డగించి ఆందోళన



బస్సులు నిలుపుదల చేసి ఆందోళన చేస్తున్న నరసాపురం గ్రామస్తులు

ప్రజాశక్తి -పద్మనాభం : కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకం అమల్లోకి తెచ్చినప్పటి నుంచి తన కూడలిలో ఆర్‌టిసి బస్సులు నిలుపుదల చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండలంలోని తుని వలస గ్రామపంచాయతీ నరసాపురం గ్రామస్తులు శుక్రవారం విజయనగరం, సింహాచలం బస్సులను అడ్డగించారు.దాదాపు 60మంది గ్రామస్తులు రోడ్డెక్కి ఉదయం 8:30 గంటల నుంచి దాదాపు రెండు గంటలపాటు రోడ్డుపై బస్సులను అటకాయించి ధర్నా చేసి నిలిపివేశారు.

గతనెల 15నుంచి తమ సెంటర్‌లో బస్సులు నిలుపుదల చేయకపోవడంతో అటు విజయనగరం, ఇటు విశాఖ వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయనగరంలో దుకాణాల్లో పనిచేసేవారు, భవన నిర్మాణ కార్మికులతోపాటు విద్యార్థులంతా బస్సులు నిలుపుదల చేయకపోవడంతో గడచిన ఇరవై రోజులుగా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అంతేకాక విజయనగరం నుంచి నరసాపురం వచ్చే విద్యార్థినిని రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో తమ సెంటర్‌లో బస్ ఆపమన్నా ఆపకుండా రెడ్డిపల్లిలో దింపేయడంపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఆర్‌టిసి యంత్రాంగం స్పందించి, బస్ సర్వీసులను క్రమబద్ధీకరించి, నరసాపురం జంక్షన్‌లో అన్ని బస్సులు నిలుపుదల చేసేలా చర్యలు చేపట్టాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేయక తప్పదని హెచ్చరిస్తున్నారు.

మహిళపై ఫిర్యాదు

ప్రజాశక్తి- సీతమ్మధార : నెలసరి సక్రమంగా అద్దె చెల్లించకపోవడంతో ఇళ్లు ఖాళీ చేయమన్నందుకు రూ.ఐదు లక్షలు ఇస్తేనే అంటూ ఒక మహిళ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఇంటి యజమాని ముద్దాడ శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. గురుద్వార్ దరి శాంతిపురంలో తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ మూడేళ్ల క్రితం ఇప్పు లక్ష్మి అనే మహిళకు తన ఇంటిని అద్దెకిచ్చానని, కొన్ని నెలలుగా అద్దెడబ్బులు ఇవ్వకపోవడంతో ఇల్లు ఖాళీ చేయమన్నందుకు తిరిగి రూ.ఐదు లక్షలు ఇస్తేనే ఖాళీ చేస్తానని, లేకుంటే ఇళ్లు ఖాళీ చేయబోనని, చేతనైంది చేసుకోమంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. నాలుగు రేకుల ఇళ్లలో ఒకదాంట్లో అద్దెకు ఉంటున్న ఆ మహిళ, మిగిలిన ఇళ్లల్లో ఎవరినీ దిగనీయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు .దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌తోపాటు నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశానని, వారే తనకు న్యాయం చేయాలని శంకర్ వేడుకుంటున్నాడు.

'రగ్ ఉత్సవ్' ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జైపూర్ రగ్స్ 'రగ్ఉత్సవ్' ప్రారంభించామని జైపూర్ రగ్స్ డైరెక్టర్ యోగేష్‌చౌదరీ తెలిపారు. విశాఖలో ఆయన మాట్లాడుతూ ఈ రగ్ ఉత్సవంలో చేతితో తయారు చేసిన 14 వేలకు పైగా రగ్స్ ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. భారతీయ నేతదారులు మన సంప్రదాయ, ఆత్మను ఆధునిక డిజైన్‌తో తీర్చిదిద్దారన్నారు. ఈ సారి ఉత్సవం మరింత వైభవంగా ఉందన్నారు. సుమారు 200 ప్రత్యేకమైన మంచాహా రగ్స్ కూడా ఈ వేడుకలో ప్రధాన ఆకర్షణ అన్నారు.

మ్యూచువల్ ఫండ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్స్ ఆధ్వర్యంలో పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమం శుక్రవారం ఎస్‌బిఐ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్స్ అధికార ప్రతినిధి సతీష్ మాట్లాడుతూ మ్యూచువల్ ఫండ్స్ ద్వారా దీర్ఘకాలిక పెట్టుబడులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. మార్కెట్ ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నప్పుడు చాలామంది పెట్టుబడిదారులు తమ సిస్టమేటిక్ ఇన్వెస్ట్మెంట్ ప్లాన్స్ (ఎస్ఐపి) లను విరమిస్తున్నారని తద్వారా రానున్న రోజుల్లో కలిగే ప్రయోజనాలను వారు కోల్పోతున్నారన్నారు. పెట్టుబడిదారులు మార్కెట్ ఒడిదుడుకులకు భయపడకుండా ఎస్ఐపిలను కొనసాగించాలని ఎస్ఐపి లు నిర్వహించే వారికి సెబి పూర్తిస్థాయి సహకారాన్ని అందిస్తుందని ఏదైనా సమాచారాన్ని ధ్రువీకరించుకునేందుకు https://www.sebi.gov.in వెబ్‌సైట్ సందర్శించాలని ఆయన సూచించారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15న చలోవిజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఆరోజు విజయవాడలో లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి ఉంటుందని భవన నిర్మాణ, కన్స్ట్రక్షన్ కార్మికుల యూనియన్ (సిఐటియు) జగదాంబ జోన్ నాయకులు కె.నర్సింగరావు తెలిపారు. సింగ్ హోటల్ జంక్షన్ వద్ద శుక్రవారం దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చలో విజయవాడ కార్యక్రమానికి హాజరు కావడం కోసం,ఈ నెల 13 నగరంలో భవన నిర్మాణ కార్మికులు విధులకు హాజరు కాకుండా, విజయవాడ వెళ్లడం జరుగుతుందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. బోర్డుకు అవసరమైన నిధులను సమకూర్చడం కోసం గతంలో ఉన్న బిల్డింగ్ సెస్‌ను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక నాయకులు సిమ్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక గృహాల కోసం బిస్పోక్ ఎఐ వాషర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శాంసంగ్ ఆధునిక గృహాల కోసం రూపొందించిన కొత్త బిస్పోక్ ఎఐ వాషర్ డ్రైయర్ శ్రేణిని ప్రారంభించింది. నగరంలోని శాంసంగ్ ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌లో జరిగిన ఈ ఆవిష్కరణలో,స్టోర్ హెడ్ ఆది మాట్లాడుతూ శాంసంగ్ కొత్త 12 కిలోల వాషర్ డ్రైయర్ కాంబో, నో-లోడ్ ట్రాన్స్‌ఫర్ సౌలభ్యాన్ని, అన్ని కాలాలకు అనువైన లాండ్రీని, ఇంటెలిజెంట్ ఫ్యాబ్రిక్ కేర్‌ను ఒకే ఇంటిగ్రేటెడ్ యూనిట్‌లో అందిస్తుందని, ఇది పెద్ద కుటుంబాలు, పట్టణ గృహాల కోసం నిర్మించబడిన స్థలాన్ని ఆదా చేసే ఉపకరణం అన్నారు.



ఎక్స్‌పోలో డిజైన్డ్ వస్త్రాలను చూపుతున్న మహిళ

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పేరు గాంచిన చీరలు, వస్త్రాల ప్రదర్శన,అమ్మకాలను గ్రీన్‌పార్కు హోటల్ లో 5 రోజులు పాటు నిర్వహించే నేషనల్ సిల్క్‌ఎక్స్‌పోను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భం గా నిర్వాహకులు మీడియాతో మాట్లాడుతూ ఈ రోజు నుంచి 8వ తేదీ వరకు ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలాది రకాల పట్టు, కాటన్ డిజైన్ వస్త్రాలు, డిజైనర్ చీరలు, బ్లౌజులు, కుర్తీలు మొదలైన వాటిని దేశంలోని వివిధ రాష్ట్రాల నేత కార్మికులు 50 శాతం వరకు తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. చీరలు తయారీదారుల నుండి నేరుగా సేకరించినవి ఇక్కడ లభిస్తాయన్నారు. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందని, ప్రవేశం ఉచితం అని తెలిపారు. డెబిట్, క్రెడిట్ కార్డులు చెల్లింపులు స్వీకరిస్తారన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



చింతూరు : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం



రాజఒమ్మంగిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం



సీలేరు : సీలేరు డిఎవి పాఠశాలలో ..

ప్రజాశక్తి - చింతూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నమాణిక్యం ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వత్తి నుండి భారత దేశానికి రాష్ట్రపతి పదవి అలంకరించిన మహనీయుడన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్ అధ్యాపకులు అప్పనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

రాజవొమ్మంగి: స్థానిక ఎంఆర్ కార్యాలయంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా శుక్రవారం విద్యాశాఖాధికారులు కారం సత్యనారాయణదొర, తూము సూరయ్యరెడ్డి అధ్యక్షతన మండల యుటిఎఫ్ మండల నాయకులు ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న 18 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మండలంలో ఉత్తమ సేవలందించిన 18 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపిపి గోము వెంకటలక్ష్మి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, బడదనాపల్లి ఎంపిటిసి లోవలక్ష్మి, బిజేపి అరుకు పార్లమెంట్ కన్వీనర్ భారతి, యుటిఎఫ్ మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, శ్రీను, మహిళా సహాధ్యక్షరాలు కె లోవరాజు పాల్గొన్నారు.

సీలేరు: జికె వీధి మండలం సీలేరు డిఎవి పాఠశాలలో టీచర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా హెచ్ఎం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు అలరించాయి. సీనియర్ ఉపాధ్యాయురాలు రత్నకుమారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బిఎస్ఎన్‌మూర్తి, బాలనరేష్, పిఈటి కమలాకర్, సహచర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల ప్రాథమిక పాఠశాలలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి శెట్టి సుందర్రావు, మండల విద్యాశాఖ అధికారి-2 గెన్ను పాల్గొన్నారు. ఇటీవల కాలంలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు పి.విలియం కేరి, రజిత, ఎన్ గోపాలరావు, పి ధనుర్జై, జి ఈశ్వరరావులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పిఆర్టియు ప్రధాన కార్యదర్శి ఎస్ అప్పలరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.కన్నయ్య, కే.రఘునాథ్ మాట్లాడారు. ఎంఇఒ ఉపాధ్యాయులు మరింత అంకితభావంతో పనిచేస్తూ సంపూర్ణ అక్షరాస్యత వైపు నడిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో భాగంగా పాటలు, శ్లోకాలు పద్యాలు, హాస్య కథలు, గిరిజన సంప్రదాయం నృత్యాలతో అలరించారు.



డుంబ్రిగుడ : రిటైర్డ్ టీచర్లను సన్మానిస్తున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

అంబేద్కర్ విగ్రహం, షెడ్ నిర్మాణానికి

ఎమ్మెల్యే వంశీకృష్ణ విరాళం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజవర్గం 29వ వార్డు పెంట వీధి స్కీం బిల్డింగ్ ఏరియాలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి షెడ్ నిర్మాణానికి రూ.2 లక్షలను తన సొంత నిధులను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కేటాయించారు. షెడ్ నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి షెడ్ నిర్మాణం చేపట్టడం తనకు లభించిన అదృష్టం అన్నారు. 29వ వార్డు ప్రజలకు ఏ అవసరం వచ్చినా తాను అందుబాటులో ఉంటానని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బుద్దల అనురాధ, జనసేన నాయకులు మన్యాల శ్రీనివాస్, వార్డ్ టిడిపి అధ్యక్షులు ఉరికేటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



షెడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

దుర్గాలమ్మ ఆలయానికి వాసుపల్లి వితరణ

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : పూర్ణా మార్కెట్ 35వ వార్డులో ప్రసిద్ధి చెందిన దుర్గాలమ్మ ఆలయానికి రూ.50 వేల విలువైన శాంసంగ్ ఎయిర్ కండిషన్‌ను దక్షిణ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం తన కుమారుడు సాకేత్ చేతుల మీదుగా బహుకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రెండుసార్లు ఎమ్మెల్యేగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలకు సేవ చేసానన్నారు. వార్డ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

సూపర్ బజార్ ఎమ్‌డిగా శ్రీరామమూర్తి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్(సూపర్ బజార్) మేనేజింగ్ డైరెక్టర్‌గా పి.శ్రీరామమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఆయన పార్వతీపురంలో జిల్లా సహకార శాఖ అధికారిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. రెండు నెలల క్రితమే ఆయనకు బదిలీ ఉత్తర్వులు జారీ అయినప్పటికీ సాంకేతిక పరమైన కారణాలతో బాధ్యతలు స్వీకరించడంలో జాప్యం జరిగింది. ఇక్కడ ఎండిగా పనిచేసిన శ్రీనివాసరాజును ప్రభుత్వం బదిలీ చేయడంతో ఇన్‌చార్జిగా జిల్లా సహకార శాఖ అధికారి టి.ప్రవీణ వ్యవహరించారు.బాధ్యతలు స్వీకరించిన శ్రీరామమూర్తి మాట్లాడుతూ సూపర్ బజార్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.



మాట్లాడుతున్న విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్

వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం): విశాఖ జిల్లా పర్యాటక శాఖ, వివిధ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఎంజిఎం మైదానంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. విశాఖ వాసులు, పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చి వంటకాలను రుచి చూశారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, స్పెషల్ సిఎస్ అజయ్ జైన్, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ పర్యాటక రంగంలో ఓపెన్ పాలసీల ద్వారా మరింత అభివృద్ధి జరుగుతుందని, అధిక రెవెన్యూ వస్తుందని అన్నారు. అజయ్‌జైన్ మాట్లాడుతూ వైజాగ్ అంటేనే టూరిజం అని, అందుకే ఈ నగరానికి ముఖ్యమంత్రి అంత ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడి పర్యాటకుల అభిరుచికి అనుగుణంగా కొత్తకొత్త హోటళ్లు, రిసార్టులు వస్తున్నాయన్నారు. భవిష్యత్తులో విశాఖ కేంద్రంగా మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 9 మెగా ఈవెంట్లు, జిల్లాల్లో 15 చొప్పున ఈవెంట్లు నిర్వహిస్తామని అజయ్‌జైన్ చెప్పారు. విశాఖలో త్వరలోనే పార్టనర్స్ సమ్మిట్, 2026లో వైజాగ్ ఉత్సవాలు జరుగుతాయని, అరకు ఉత్సవాలు కూడా ఉంటాయని, ఆ మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ ఇక నుంచి వైజాగ్‌లో ప్రతి నెలా ఒక ఈవెంట్ నిర్వహిస్తామన్నారు. అనంతరం స్టార్‌చెఫ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన హోటల్స్ చెఫ్‌లకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. తదుపరి అతిథులంతా ఫుడ్‌స్టాళ్లను సందర్శించి వంటకాలను రుచి చూశారు. కార్యక్రమంలో టూరిజం శాఖ అధికారులు జె.మాధవి, జగదీష్ పాల్గొన్నారు.



స్టాళ్ల వద్ద గుమికూడిన జనం